దుఃఖం

తుమ్మల దయానంద

675

2450

10177



తె.సెం:1
దా.ఖా-5
10177

DUE DATE SLIP

C . P. BROWN MEMORIAL TRUST

LIBRARY, CUDDAPAH.

Accession Number 2450

This bookmay be kept for not more than 7 days

(675)

2450

పర్జన్యం

(ఏయు పుత్రులు
(కీ R. అనంతపద్మనాభ
రావుగారికి
వీరదశాలతో
కలుగనేర్చు

కవితా సంకలనం

27.4.79.

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No. 10177
Date...
CUDDAPAH.

127

R. A. Padmanabha Rao
Siddhanthi
Old India Press
ANANTAPUR-515001 (A.P.)

ఈవని దయానంద

ప్రథమ ముద్రణ
సెప్టెంబరు 1976
హక్కులు రచయితవి
మూల్యం 5-00

ఆదరాభిమానాలతో ఆర్థికంగా తోడ్పడిన
సహృదయులూ కవితాప్రియులూ

శ్రీ కె. సిహెచ్. పాండురంగారావు గారికీ
శ్రీ చిరుపోతు వెంకటేశ్వర్లు గారికీ
శ్రీ బాలంరెడ్డి పున్నారెడ్డి గారికీ

నా హృదయ పూర్వక నమోవాకములు

ప్రతులకు—

రచయిత
తూర్పుపాలెం
ఒంగోలు
ప్రకాశం జిల్లా

ముద్రణ
ప్రగతి ప్రింటర్స్
ఒంగోలు

2450

సూచిక

1.	పర్జన్యం	1
2.	ఓ నలఉగాదీ! నీ కులమేదీ?	3
3.	ఎక్కడున్నది మానవత్వం	14
4.	ధర్మక్షేత్రం – కర్మసూత్రం	18
5.	ఇది చేదుమందు – సేవించు ముందు	23
6.	వేషం – ద్వేషం	31
7.	క్రిమిసంహారిణి	37
8.	పుణ్యభూమిలో భరతపుత్రి	44
9.	మధుశాల	48
10.	దీప ప్రకాశం – దివ్య సందేశం	51
11.	సామ్యవాది సమవర్తి	55
12.	స్వర్గాదపి గరీయసి	59
13.	వింతకోర్కె	63
14.	నవకవితా కుమారీ!	67
15.	బాపూజీ బ్రహ్మాస్త్రం	70
16.	గ్రామ రాజ్యకీ జయ్‌బోలో	73
17.	పేరునుజూచి ప్రేమించకు	75
18.	వేగుచుక్క	80

2450

ప్రపంజనుడి విజృంభణ

ఒక కవితాగోష్ఠిలో మిత్రులు ఈమని దయానందగారు "ఎక్కడున్నది మానవత్వం? అన్న కవిత మహోద్రేకంతో వినిపించగా శ్రోతలలో ఒకడుగా నేనూ యెంతో ఆనందంగావిన్నాను. అవును. ఎక్కడున్నది మానవత్వం? మానవులున్నారు. మానవమాత్రులున్నారు. మానవత్వం లేదు. దయానందగారి హృదయవేదన పదపదాన ఈకవితలో పొంగులెత్తింది. దయానందగారి కంఠం పర్జన్యం. నిజానికి ఆయన కలంలోనే పర్జన్యం వుంది. అది గర్జిస్తుంది. కవితావృష్టి కురుస్తుంది. ఆ కవితావృష్టిలో సహృదయ పాఠక, శ్రోతృలోకం యెన్నోసార్లు తడిసింది.

"మానవత మానవతయని ప్రతి
మానవుడు వల్లించు సూత్రం
మరపురానిది మాట మాత్రం
మనిషిలో అది నామమాత్రం"

ఈ శీర్షికను దయానందగారు కవిత రచించినపుడు వగగభూమి (బాంగ్లా) దానవుల కరాళనృత్యంతో చితికిపోతుంది. మానవత్వం నశించిపోయినందుకు కవిపడుతున్న ఆవేదనే ఈకవిత. దానవత్వం రాజఘాటు సమాధిలోనూ, లింకన్ గుండెలోదూసిన గుండ్లలోను, జలియన్ వాలాబాగ్‌లోను, లుముంబా ఊరికంబంలోను వుంది. మమత పశువులోను, పక్షిలోనువుందిగాని మనిషిలో నశిస్తున్నదని కవి బాధపడుతున్నారు.

"ఎక్కడున్నది మానవత్వం?" అన్న కవితవిని, లేదాచదివి వేదనపడనివారుండరు. దానవత్వం నశించి మానవత్వం ఎప్పటికి అవతరిస్తుందోకదా!

"వేషం – ద్వేషం" అనే కవితలో

"ఆ మహాత్మునితోడ నాదర్శములుగూడ
దివికేగెననుమాట తెలిసికొనకున్నావు"

అన్నమాట యదార్థం

అస్పష్టతతో అయోమయత్వంతో అలమటించిపోతున్న ఈనాటి కవితా ప్రపంచానికి దయానందగారి కవిత ఒక రిలీఫ్. ఆయనయేంచెప్పదలచుకొన్నాడో ఆయనకు తెలుసు, ఎలాచెప్పాలో తెలుసు.

నిద్రపోతున్న లోకాన్ని మేల్కొలపగల పర్జన్యం దయానంద గారి కవిత్వం అనడానికి ఎన్నినిదర్శనాలైనా చూపవచ్చు. నేటి సామాజిక వ్యవస్థలోని కుళ్ళును నిర్దాక్షిణ్యంగా బయట పెడతాడీకవి.

"పుణ్యభూమిలో భరతపుత్రి" అన్నకవితలో

"శ్రీనాథుడేనాడో వాపోయాడట పాపం
స్త్రీగా పుడితే జీవితమే పూలబాటయ్యేదని"

అన్నారు దయానంద. ఈ పంక్తులు చదివినపుడు ఒక శ్లోకం జ్ఞాపకం వస్తుంది.

"నృపసీక్షితు మ్రతకే వయం?
స్తనభారానమితాన యోషితః"

"రాజుగారిని చూడ్డానికి మాకు అర్హత ఎక్కడిది? స్తన భారమునగల స్త్రీలము కాముకదా!" అని ఒకకవి వాపోయాడట.

అధికారమదాంధులకు, భోగైకజీవులకు—"ఇంటర్వ్యూకోసం వచ్చిన ఇంతుల ముఖం చూడగానే—ఎంతటి ప్రశ్నలవర్షమైనా ఇట్టే వెలిసి పోతుంది." అంటారు కవిగారు.

"కాలగతి మారినా
కవివాక్కు చెరగనిధ్వని" అంటారీ కవి. ఆ మాట అక్షరాలా నిజం. శ్రీనాథునిమాట ఈనాటికి ఎంత సత్యమో శ్రీదయానందగారిమాట యేనాటికీ సత్యంగానే వుండిపోతుంది.

దయానందగారు గేయకవి. అట్లని వచనకవితలు వీరు ప్రాయలేదనికాదు. "పుణ్యధాత్రిలో భరతపుత్రి, క్రిమిసంహారిణి, పేరును జూచి ప్రేమించకు, ఓ నలఉగాది నీ కులమేది?" వంటి ఎన్నో కవితలు వీరి ప్రీవర్స్‌కు చక్కని ఉదాహరణలు. అయితే శ్రీ దయానంద మనసులోని భావాలు ముఖ్యంగా ఆయన హృదయంలోని గాయాలు లయబద్ధమైన గేయాలుగానే ఎక్కువ బయలు వెడలుతాయి.

"ఇజాలెన్ని భువి వెలసిన
ఏమిటి ఫలితం తల్లి?
సామాన్యుల జీవితాలు
చక్కబడేనా మళ్ళీ?"

ఈ త్రిశ్రగతిచరణం అప్రయత్నంగా కవిహృదయంలోనుంచి ఉప్పొంగింది. ఇందులోని భావమెంత మనోహరమో శైలి అంత రమణీయం. అవును సామాన్యుల జీవితాలను చక్కబరచలేని ఇజాలెందుకు?

నేటి సమాజాన్ని, రాజకీయ వ్యవస్థని, ప్రభుత్వయంత్రా
గాన్నీ సునిశితంగా పరిశీలించి అందులోని ఘోరాలు బట్టబయలు
చేయడమూ, విమర్శించడమేకాదు ఈకవి చేయదలచింది. ఆకుళ్ళుకు
బాధ్యతంతా ఎవరిమీదో వేసి తప్పుకోవడంకాదు ఈకవి కోరేది.

"సాగించే పాలనలో
సైపరాని దోపాలను
సరిదిద్దుట మనధర్మం
లేకుంటే మనకర్మం"

"పొరుగావిడ మగడెంతో
సరసంగా వున్నాడని
అతడే నామగడంటే
హర్షిస్తుందాలోకం?" అంటారీకవి "వింతకోర్కె"
అన్న కవితలో

"నీవారిని దిద్దుకొనుట
నీకెప్పుడు సుఖప్రదం" అని ప్రబోధిస్తాడు.
"కావ్యానికి నిరుపేదల
గాథలనితివృత్తంగా
ఎన్నిన కవి — మన దయానంద.

"కులమతాల రొంపిలోన
కుళ్ళిన యీసంఘంలో
దుర్గంధం సైపలేక
దురంతాలు చూడలేక

రాజకీయ కుతంత్రాల
రహస్యాలు తెలియలేక
రగిలే ఆకలిమంటల
సెగలను చల్లార్పలేక

నిరుద్యోగి నిట్టూర్పులు
నిప్పులు కురిపిస్తుంటే
నిరుపేదల విషాదాలు
నీగుండెలు మండిస్తుంటే

ఆవేశమ్మాపలేక
ఆక్రోశిస్తున్నావా?
నవసమాజ నిర్మాణం
నీవిధియనుకున్నావా?" అంటూ "నవ కవితా కుమారి" అనేకవితలో రూపందిద్దిన అభ్యుదయకవి యెవరోకాదు. అతడే మన దయానంద.

మాటల్లో చెప్పలేని ఆవేశాన్ని, ఆవేదననీ, మాటల్లో చెప్పడానికి ప్రయత్నించడమే కవిత్వం. ఈప్రయత్నంలో మన దయానంద విజయం సాధించారు.

"పర్జన్యం గర్జించెను
పాంచజన్య నాదంవలె
ప్రభంజనుడు విజృంభించె
ప్రళయకాల రుద్రునివలె" ఆప్రభంజనుడే దయానంద.
ఆ పర్జన్యమే దయానందగారి కవిత.

"వేగుజుక్క పొడిచెననీ
వెలుగులు ప్రసరించెనని" ప్రభాతగీతం ఆలపించి —
"భయమందకుభాయీ నీ
బాధలన్ని తొలగునోయి" అని
అభయహస్తంతో ధైర్యంచెప్పే ఆశావాదీ అభ్యుదయకవి ఈ "పర్జన్యం"లో సాక్షాత్కరిస్తాడు. మనదయానంద కవి విశ్వరూపమే ఈకవితాసంపుటి. వ్యత్యాసాల చలితో వడవడవణకిపోయే దీన ప్రజకు విప్లవపు నిప్పులకుంపటి, ఆకలితో అల్లాడే మెదళ్ళకు కమ్మని సంకటి.

And when man in his agony is dumb
I have God's gift to Utter what I suffer
— Goethe

మద్రాసు
15-7-76

దాశరథి

సాహ్యవాద పర్జన్యం

కవిత్వం ఉరిమేమేఘుం అవుతుంది. ఒకప్పుడు ఉరమని పిడుగూ అవుతుంది. దౌర్జన్యం పెరిగినప్పుడు పర్జన్యం అవసరమవుతుంది. నీటిమబ్బులు ముసురుకోవాలి. ఉరుములూ, మెరుపులూ ఉద్భవించాలి. కుండపోతగా కురవాలి. విషవృక్షాలమీద పిడుగులుపడి అవి దహించుకుపోవాలి. వాన వెలిశాక ప్రకృతి ప్రక్షాళితమవుతుంది. సమాజం పచ్చపచ్చగా నవ్వుతుంది.

ఇవాళ దేశంలో చాలా రుగ్మతలు ఉన్నాయి. నిన్నటికన్నా ఆస్తి చాలా జాస్తి. సమాజం రోగగ్రస్తమైతే కవి వైద్యుడుకాక తప్పదు. ఆధునికకవి చేదుసత్యాలకు పంచదారపూతలు పూయడు. వగరు వగరు చూర్ణాలను తేనెతో రంగరించమనడు. నువ్వు బాగు పడాలంటే "ఇది చేదుమందు - సేవించుముగదు" అని కచ్చితంగా చెప్తాడు. సేవింప చేస్తాడు. మానవుడిలో దాగున్న దానవుణ్ణి వెడలగొడతాడు. తరతరాల మూఢవిశ్వాసాల 'క్రానిక్' జబ్బులను నయం చేస్తాడు.

"నొసటి వ్రాత తప్పించే
పసగల వాడెవ్వడోయి?"

అని ప్రశ్నిస్తే తానేనని చెప్పకుండా చెప్తాడు. చెప్పింది చేస్తాడు.

పశువుకున్నది పక్షికున్నది
ప్రకృతిలో ప్రతిజీవికున్నది
మమతయున్నది సమతయున్నది
మనిషిలో నశియించుచున్నది

కాబట్టి సమతను నిలబెట్టడం అవసరం. మొలకెత్త జేయడం అవసరం. అందుకేఆవిర్భవిస్తుంది సామ్యవాదపర్జన్యం అంటున్నారు మిత్రుడు దయానంద.

తథాస్తు

త్యాగరాయ నగర్
మద్రాసు
17 – 8 – 76

ఆరుద్ర

ఆశీస్సులు

సామాజిక పరమైన స్వీయానుభవాలతో బరువెక్కిన కవి హృదయ పర్జన్యం కురిపించిన అమృతవృష్టి మన దయానందగారి కవితాసృష్టి. ఈకవితామృత సేచనంతో ఎండిపోతున్న మొక్కలన్నీ ఇగుళ్ళువేయాలనీ యీ పర్జన్యగర్జనతో కులహర్వతాల గుండెలు బ్రద్దలుకావాలనీ ఆశిస్తున్నాను. ఆశీర్వదిస్తున్నాను.

గుంటూరు
25-10-76

డా॥ జె. వీరాస్వామినాయుడు
రిటైర్డ్ జిల్లా వైద్య శాఖాధికారి

'వెరపు కొరడా'

నేటి కవులు ముఖ్యంగా మూడు రకాలు:

1. సమాజపరంగా జరిగే భాగోగులను బాగా పరిశీలిస్తూ భాగుపక్షాన్ని ప్రోత్సహిస్తూ ఓగుపక్షాన్ని నిరసిస్తూ రాసేవాళ్ళు

2. ప్రస్తుతసమాజంలో వాలాయించి చెడునేమాచి దాన్నే చిత్రీకరించేవాళ్ళు.

2. ప్రస్తుతసమాజ జీవితంతో సంబంధంలేకుండా తమఇష్టం వచ్చిందల్లా రాసేవాళ్ళు.

శ్రీ ఈమని దయానందగారు మొదటివరసలోనే కనిపిస్తున్నారు. ఈయన "సిద్ధాంతులు ప్లస్ వేదాంతులు ఈక్వల్ టు బడిపంతులు" కాబట్టి సిద్ధిపొందిన తన భావాలను సునిదితంగానే చెప్పారు. ఎంత చెప్పినా, ఎన్నివిధాల చెప్పినా బాలహతం మాననట్లున్ననాళ్ళకు చెంపపెట్టుగా చెప్పవలసి వస్తుంది. అట్లా కొంతచెప్పారు.

'ఓ నల ఉగాదీ!' అనే కీర్నిక రీవిగా నడిచే సాంప్రదాయిక పద్యశైలితో ప్రారంభమైంది. తర్వాత స్వచ్ఛందశైలిలోపడింది. మళ్ళీ పద్యశైలి, మళ్ళీ నవీన వచనకవితా శైలి. ఈతరహారచన మొదట ఆశ్చర్యమే కలిగించినా తీరాచూస్తే ఒకవాస్తవదృక్పథాన్నే అందిస్తుంది. నేటిసమాజ సాంప్రదాయాన్ని తప్పించుకోలేక పోతున్నది. సాంప్రదాయికపద్ధతికే అలవాటై కాస్తనడుస్తుంది. కొత్త మోజులోపడి సంప్రదాయానికి దూరంగానడుస్తుంది. సంప్రదాయమే

నయమా మళ్ళీ ఒకక్రమంలో నడవబోతుంది. కొత్తవాసనల ఆకర్షణతో మళ్ళీ స్వేచ్ఛగా ప్రయాణిస్తుంటుంది. నేటిసమాజశైలిని కవితాశైలిలోగూడా ప్రతిబింబించిన కవిదృష్టి సరికొత్తది.

కులతత్వం కూటిను పెళ్ళగించే ఈకవి కలంబలం ప్రశంసనీయమైంది. ఎన్నిమూఢాచారాలకో అతీతులుగా కనిపించేవాళ్ళు, ఆధునికమార్గదర్శకులు అనిపించుకొన్నవాళ్ళు ఇంకాకులతంత్రాన్నే అనుసరించిపోతున్నారు. పల్లె నుంచి ఢిల్లీదాకా కనిపిస్తున్నది కుల భారతమే. "అందరూ పుట్టే స్థలం ఒకటే, ఎక్కువ తక్కువ అనే కులవాసనమానండి" అని వేమన్న ఘాటుగాచెప్పినా ఇంకా వదలనే లేదు ఈకులభావన. అందుకే దయానంద వంటి కవులు కుల కులదాస్యం పోవాలనే రాస్తున్నారు. ఇంకా ఇట్లారాయవలసిందే.

"సంస్కరణల పేరువిన్న సంక్షుభితమ్మౌతున్నది,
సమసమాజమంటేనే సమ్మతింపలేకున్నది"

— ధర్మక్షేత్రం - కర్మసూత్రం ఇట్లాఉందని కవి నేటిసామాజిక మనస్తత్వాన్ని ఒక్కవాక్యంలో చెప్పగలిగారు. అవసరమైనదాన్ని ఆయంపట్టి ఇట్లాచెప్పడం ఉత్తమకవిలక్షణం.

'పర్జన్యం' యువతరం ఉద్యమశక్తికి ప్రతీక. 'ఇది సామ్యవాద పర్జన్యం' అని కవి స్పష్టంగానేచెప్పారు. దీనిచలవవల్ల దేశమంతా సుజల, సుఫల అవుతుందని ఆశింతాం.

తెలుగు అకాడమి
హైదరాబాద-29

డా॥ ముకురాల రామారెడ్డి

వందనాలు - అభినందనాలు

సాహిత్యం సమాజానికి దర్పణమన్నమాట సర్వవిదితం. సంఘంలో ఒక అంగంగా జీవిస్తున్న రచయిత సామయిక పరిస్థితులకు స్పందించకుండావుండలేడు. ఆవేశంపెల్లుబికినపుడు, ఆవేదనతో తల్లడిల్లినప్పుడూ రచయిత హృదయం ప్రత్యక్షరంలోను ప్రత్యక్షం కాక తప్పదు. అది అగ్నిగుండంలోంచి అమృతభాండాన్ని ఆవిష్కరించక మానదు. నవచైతన్యాన్ని సంతరి చకపోదు.

జాతిమత వర్గాల జాడ్యం, కులగోత్ర సంప్రదాయాల మూఢ్యం, దైవభక్తిపేరిట దోపిడీలు, దేశభక్తి పేరిట దగాలు- ముఠా తగాదాలు, ప్రాంతీయ విద్వేషాలు, భాషావైషమ్యాలు యింకా ఎన్నెన్నో అంటురోగాలతో కుంటుతున్న సమాజంలో హేతుబద్ధమైన ఆలోచనల్ని ఏమాత్రం రేకెత్తించగల్గినా ఆప్రక్రియ మహోదాత్తం, అందుకే యీ ప్రయత్నం. ఇందుకు చేయూతనిచ్చిన సహృదయులూ సుహృదులూ ఎందరెందరో ఉన్నారు. వారందరికీ నా వందనాలు.

తమ పీఠికతో పాఠకలోకానికీ పుస్తకాన్ని పరిచయం చేసిన కవితా పయోనిధి కళాప్రపూర్ణ డాక్టర్ దాశరథిగారికీ -

'సమగ్రాంధ్రసాహిత్య' నిర్మాత అభ్యుదయ కవితావిధాత స్నేహశీలి శ్రీ ఆరుద్రగారికీ -

ప్రగతిపథంలో కవితాసుధలు చిందిస్తున్న ఆధునికకవి మిత్రులు డాక్టర్ ముకురాల రామారెడ్డిగారికీ

సామాజిక రుగ్మతలకుసైతం శాశ్వత పరిష్కారమార్గాలన్వేషిస్తున్న ప్రియమిత్రులు డాక్టర్ జె. వీరాస్వామిగారికీ మున్ముందుగా నా కృతజ్ఞతాభివందనాలు.

ఈ సంకలనంలోని అనేకకవితల్ని తమ సాహిత్యమాసపత్రిక "ప్రవంతి" ద్వారా తెలుగునాట వెలిగించిన హితైషి శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి గారికీ, దీన్ని ముచ్చటగా ముద్రించి యిచ్చిన ప్రగతి ప్రింటర్స్ వారికీ, ముఖచిత్రం గీచియిచ్చిన శ్రీ చంద్రగారికీ నా కృతజ్ఞతలు.

మరో మాట —

అనేక సందర్భాలలో రచించబడ్డ యీ కవితా ఖండికల్ని సంకలనంగా మీముందుంచ సంకల్పించిన మన డాక్టర్ రావిపాటి ప్రసాదరావుకు నా ఆశీస్సులు — న్మాశేయమే తనధ్యేయంగా భావిస్తున్నందుకూ ఈపుస్తకంయొక్క సమస్తభారాన్ని తనమస్తకం మీద వహిస్తున్నందుకూ నాహార్దికాభినందనలు.

దయానంద

పర్జన్యం

విద్వేషాల గ్రీష్మ తపంతో
వివేకానందాల బాష్పకణాలు సైతం
ఇంకిపోయిన లోకంలో
ఇనుమడించిన శోకంలో
సుందర నందనోద్యానాన్ని
సురలోకం నుంచి నరలోకానికి రప్పించాలని
బీటలు వారిన బ్రతుకుల్ని
పూదోటలు గావించాలని
యువతరమంతా పర్జన్యంగా
అవనిదద్దరిలేలా గర్జిస్తున్నది
విద్రోహుల్ని తర్జిస్తున్నది
వింత ప్రకృతిని నిర్జిస్తున్నది
దుర్దినాల్లో వర్ధిల్లే
దురుద్యోగ దుశ్శాసనుల్ని
మర్దించడానికి
మహోద్వేగంతో తరలి వస్తున్నది
ఇంద్రాయుధాన్ని సంధించుతూ
ఇరుల తెరలన్నీ భేదించుతూ
మెరుపు కొరడాతో
మేదినీ వలయాన్నదిలిస్తూ

మేఘారావంతో
మాయాజాలాన్ని విదళిస్తూ
ఆవిర్భవిస్తుంది సామ్యవాద పర్జన్యం
అంతరిస్తుంది బూర్జువాల దౌర్జన్యం
ఘనీభవించిన మేఘమాలిక
వినీలాకాశం నుంచి వీక్షిస్తున్నది
శుష్కించిన జీవన లతల్ని చూచి
సున్నితమైన హృదయం ద్రవిస్తున్నది
అమృత ధారల్ని కురిపిస్తుంది
ఆర్తహృదయాల్ని మురిపిస్తుంది
సమతా ధర్మం చవి చూపిస్తుంది
సంస్కృతీలతకు పునరుజ్జీవం సంతరిస్తుంది

• • •

ఓ నలఉగాదీ! నీకులమేదీ?

పలవించిన కంచి
పట్టు చీర ధరించి
పసిడియంచుల మేలి
ముసుగునించి
కనకాంబరమ్ములా
కంచుకమ్మి బిగించి
ఎదలోని పొంగు
పయ్యెదను దాచి
అలివేణి సవరించి
తొలిచేయి వధువులా
బొండు మల్లియల
పూదండ గూర్చి
పూదుమారమ్ము
మైపూతగా వెలయించి
లలిత సుందర
తనూలత వహించి
కదలి వచ్చినదిదిగో ఉగాదిబాల
సరస సంగీతములనీ వసంతవేళ
ముసలి తాతకు సైతమ్ము మోజుపుట్ట
బ్రహ్మచారుల బింకమ్ము బైటబెట్ట

ఇలా అందచందాలన్నీ
పొందిగ్గా చెబుదామనుకుంటే
ఉగాదిబాల అంగాంగ సౌందర్యాన్ని
నగాధిపుని గుండెలపై సైతం
నర్తించే నవోత్కర్షాన్ని
మధుమాస మందహాసాన్ని
వసంత ఋతు చిద్విలాసాన్ని
మహోమహులెందరో
మహత్తరంగా వర్ణించారు
జగత్తునే మురిపించారు
నన్నేమని చెప్పమంటావు ఉగాదీ!
నన్నేలా మెప్పించమంటావు త్రికాలవేదీ!

పద్యాన్ని హృద్యంగా
నైవేద్యం చేయమంటావా?
గేయంగా మదిలోని
గాయాన్నావిష్కరించ మంటావా?
వచనంలో పచనమయ్యేలా
రచన సాగించ మంటావా?
ఛందం తెలియకపోతే
ఛందం రాదంటిరి
అది కవిత్వమే కాదంటిరి
గీతం రాయకపోతే
దేశీయత లేదంటిరి

అది శ్రోతనాకట్టుకోబోదంటిరి
వచన కవితలల్లకపోతే
రచనలో అభ్యుదయం లేనే లేదంటిరి.
అందుకే వసంతా
అదికాస్తా ఇదికాస్తా
కలగలిపి నేనురాస్తా
కనుకనే నాదో చొరాస్తా
భావనా బలమున్నదల్లా
కవితాంశమేనని నేతలుస్తా
ఉగాది పచ్చడిలా
షడ్రసోపేతమైన సమాచారమందిస్తా
తెల్లని మల్లెలు పూచినా
చల్లని గాలులు వీచినా
పల్లవ చేలాంచలాన
ప్రకృతికాంత పరువం తోచినా
నాకేమో అనిపిస్తున్నది
దాన్నే నే వినిపిస్తున్నది
ఇది వసుధకు సుధ లందించే ఉగాది
అనాదిగా ఆశాసౌధాలకిది పునాది
శోకాకులమైన కాక స్వరంలో సైతం
కోకిల రాగాలాపన వినిపించగలది
తుమ్మ ముళ్ళ బీళ్ళల్లోసైతం
కమ్మని మామిళ్ళు కాయించగలది

ఎండిపోయిన బ్రమోళ్ళల్లో సైతం
ఎట్టని చివుళ్ళు వేయించ గలది
ఎడారి బ్రతుకుల్లో సైతం
ఎన్నెనో ఒయాసిస్సులు చూపించగలది
ఉజ్జ్వల భవితవ్యానికి
ఊహాగానం చేయించగలది
కలిగిపోయిన జీవితాల్లో
నవచైతన్యం రేకెత్తించగలది.
ఇది నవయుగాది
నల ఉగాది
కవుల కమనీయ
భావనా సౌరభాలకిది బ్రోది.
అందుకనే ఆమని
ఆనంద బ్రదాయిని
అంటున్నా 'ఓమని'
ఆమనికిదె స్వాగతమని.
అవును ఈ ఉగాది
అవనీతలానికి దివ్యవరబ్రసాది
బ్రాకృతిక రహస్యాలెన్నో
బ్రత్యక్షం గావించేది
సుఖదుఃఖాల సమ్మేళనంలోని
సూక్ష్మజ్ఞానం వివరించేది.

ఎండిపోయిన ప్రేమాకులన్నీ
వ్యధిత హృదయ ప్రతీకలుగా
పండిపోయిన ఆకులన్నీ
పతిత జీవన రేఖలుగా
అరుణారుణ పల్లవాలు
అనురాగాల మాలికలుగా
తరుణ లతానికుంజాలు
పరమానందాల డోలికలుగా
అనుభూతిని కలిగించేది
మన మనమసులు కదిలించేది
ఆనందం కురిపించేది
అన్నిటినీ మురిపించేది.

ఇది మధుమాసం
విచిత్ర విధివిలాసం
ప్రకృతి కాంతాధరోదిత
మధుర దరహాసం
విరబూచిన పూవులతో
అరుదైన సందేశం వినిపిస్తుంది
చిరునవ్వుల జీవితమే
సార్థకమని సూచిస్తుంది
నశ్వరమైనదీకాయం
శాశ్వతమనుకోవద్దని
నవయవ్వన ప్రాయం

నాల్గు గడియల ముచ్చటనీ
పువ్వుల్లా నవ్వుతూ,
పూదేనెలు రువ్వుతూ,
అల్లాడే బ్రతుకు తోటల్లో
ఉల్లాసం నింపాలని
ముళ్ళబాటలో నడిచే
వాళ్ళకు పూసెజ్జలుగా
కుళ్ళేరుగని సహృదయం
వెల్లడించు ఒజ్జలుగా
మానవ జీవనమే
మహితాదర్శం కావాలని
పావననందనవనమీ
అవనిపైకి రావాలని
పదిమందికి పరిమళాలు
పంచడమే పరమార్థమనీ
పారిజాత సుమదళాలు
ప్రబోధాలు చేస్తుంటే
రాలుతున్న పండుటాకు
రహస్యాన్ని చెబుతున్నది
ప్రాణికోటి కెప్పుడైన
మరణింపక తప్పదని.
రాగ రంజిత కిసలయము లను
రాగ పూరిత జీవనమ్మున
సాగిపొమ్మని చెప్పుచున్నవి

సౌమనస్యము నేర్పుచున్నవి
పల్లవ హస్తాలతో
ప్రాకుతున్న లేదీవలు
పునరావసలో సైతం
పైకిలేచే జతనాన్ని
సుతరామూ విడిచి పెట్టద్దంటున్నవి
అందుచేతనో
మరెందుచేతనో
ఉగాది వస్తుందనే సరికి
ఉవ్విళ్ళూరుతుంది మనసు
ఉప్పొంగిపోతుంది
ఉర్వికాంత సొగసు
పరవశించి పాడుతుంది
పరువంలో వయసు
పరమార్థమేమిటో
పండితునికి మాత్రమే తెలుసు.
కవి కోకిల గానం చేసినా
కవితామృత పానం చేసినా
తల్లి భాషను ధ్యానం చేసినా
ఒళ్ళంతా హూనం చేసినా
అనుకున్నది నెరవేరడంలేదు
ఆశించింది అందిరావడంలేదు.
ఉగాదినాడుద్యమించిన పనికి

ఏడాది పొడుగునా
ఏ ఆటంకం రాదంటారు
మూడుగానులు దాటిపోయినా
ముడిబడని ప్రయత్నాలెన్నంటారు?
ఒక్క మాటడుగుతా ఉగాదీ
చిక్కనబడతావేమో సంవత్సరాదీ
చేతనాలుగాని
చెప్పలమీదున్నంత ప్రేమ
చితికి పోయిన
మానవాళిమీద కానరాదేమి?
శుకపికాలమీద
సుడిగొంటున్న మమతామృతం
నకనకలాడే డొక్కలపై
నర్తించదేమి
జాతిమత వర్గాల చిలిపి జాడ్యం
నిన్నూ పట్టుకుందా?
నికృష్టమైన కులగోత్రాల వలపక్షం
నీలోనూ గూడుగట్టుకుందా?
సగోత్రుడు కాకుంటే
ప్రతినేత్రుడైనా ప్రబతకలేని యీ దేశంలో
కులంపేరు చెప్పకపోతే
కలానికైనా గళానికైనా
బలం చేకూరని స్థలంలో

నీమనుగడకే ముప్పనుకున్నావా?
సమధర్మం తప్పనుకున్నావా?
అందాల ఓ ఉగాదీ
అసలు నీ కులమేది?

ఇందుకు జవాబు చెప్పకుంటే
ఇక్కడ నిలువ నీడేదీ?
కులమేదని అడిగితినని
కలవరపడ వలదు
మాకు కడుసహజమ్మా
తొలిప్రశ్న; కాన నాపై
పలదమ్మా కినుకబూన
వలదు ఉగాదీ!

కులమత మోహ సంజనిత
కుత్సిత తర్క వితర్క వాదముల్
బలిసిన నాట బుట్టిన
అభాగ్యుల జీవన యాత్రజూచి
వ్యాకులితుడు కానివాడెవడు?
కుళ్ళిన సంఘములోన
నీది యే కులమను ప్రశ్న లేక
సమకూరదు గారవ మెంతవారికిన్.
రామునైన సుగుణ ధామునై ననుగాని
కులము తెలుపకున్న కొలువబోము
కూడుగుడ్డలేల కులమున్న చాలదా
గొప్పలంద జగతి మెప్పులంద.

ఈ భావన విడకున్నది
సమజీవన మేర్పడకున్నది
నీనైనా ప్రేమామృత
మందిమ్మని నేన్నది
సోషలిజం

సొంపులు నింపుకుంటున్న రోజుల్లో
శుష్కించిన జీవన లతలకు
నవ శోభలు
దిద్దాలనుకుంటున్న రాజ్యంలో
నీరాకతో మానవ
హృత్కళికలు వికసించాలి
సర్వమానవ సౌభ్రాత
పరీమళాలు ప్రసరించాలి

తరులారా! విరులారా!
తరుణ లతామంజరులారా!
నరజాతికి మీరైనా
నవ్యోపదేశం చేస్తారా?
వలపులు మొలకెత్తించే
శుకపిక శారికలారా!
అమర సంగీతమాలపించే
భ్రమర గాయకులారా!
మానవ హృదయాలలోన
మమతలు పూయిస్తారా?

సమతలు కాయిస్తారా?
దీనజనాభ్యుదయానికి
దీపనలందిస్తారా?
కరుణ రసపావన మొనరిస్తారా?
చైత్రరథమ్మధిష్ఠించి
చిత్ర చిత్రరుచులు నించి
ఏతెంచిన వసంతుడా!
ఇది ఎమర్జన్సిరా భాస్వంతుడా!
మనిషి మనసు విరియించరా
మమతామృతం కురియించరా
సమసమాజ సంస్థాపనకై
అమరవాణి ప్రమోయించరా!
ఎందరెందరో ఆశాజీవులు
అందరికీ నీ పూవుల తావులు
అందజేయరా ఋతురాజ!
అందుకొమ్ము నా కవితాపూజ.

• • •

ఎక్కడున్నది మానవత్వం ?

మానవత మానవతయని ప్రతి
మానవుడు వల్లించు సూత్రం
మరపురానిది మాట మాత్రం
మనిషిలో అది నామమాత్రం

ఎక్కడున్నది మానవత్వం
ఎందుజూచిన దానవత్వం
ప్రబుతుకు నిండా భానిసత్వం
మారదా యీ మనస్తత్వం?

పదవి కోసం భావదాస్యం
పరువు మాలిన ప్రబుకు దూష్యం
మానవత్వం మంట గలిపిన
మనిషి మనుగడయే అపహాస్యం

ఎక్కడున్నది మానవత్వం
ఎందుజూచిన దానవత్వం
రాజఘాటు సమాధిలో నీ
రాజనాలందేను నిత్యం

బోధిసత్వుని ప్రబోధమ్ములు
బూదిలో పన్నీటి జల్లులు
చెదలు బట్టిన తాటియాకులు
జైనమత సిద్ధాంత సూక్తులు

జనత కోసం శిలువ నెక్కిన
జాతిరత్నం ఏసుక్రీస్తుని
త్యాగశీలమ్మెంత జెప్పిన
ఆగునా యీస్వార్థ చింతన?

బానిసత్వం రూపుమాపగ
మానవత మేల్కొలుపు'లింకన్'
గుండెలో కసిదీర దూసిన
గుండ్లలో'పల దాగియున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

నేతలను శ్రోతలను సైతం
పాతిపెట్టిన ప్రేతభూమది
'డయ్యరే' ఒకదయ్యమై విహ
రించు 'జలియన్ బాగు'నున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

గాంధి దేవుని స్మారకమ్ములు
గ్రామ గ్రామమునందు వెలిసెను

గాంధి చెప్పిన ధర్మబోధలు
కాలగర్భమునందు గలిసెను ॥
ఎక్కడున్నది మానవత్వం?

జాతికోసం నీతికోసం
నేతగా నిలిచిన 'లుముంబా'
కంఠమునకాభరణమా ఉరి
కంబమందున దాగియున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

కులంపేరిట మతంపేరిట
కూడగట్టిన సంఘమందు వి
భేదభావం రంగరించెడు
బోధలందున దాగియున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

పట్టపగలొక భక్తినిలయం
రాత్రికది శృంగార వలయం
భ్రూణ హత్యల కాశయమ్మగు
పుణ్యతీర్థములందు నున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

నిరుద్యోగుల ఆశలన్నిటి
నీరుగార్చే తీరుగా దర

ఖాస్తులను జీర్ణించుకొనియెడు
'డస్టుబిన్'లో దాగియున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

ఇరుగువారిని పొరుగువారిని
ఈసడించే మనస్తత్వం
కరుణమాలిన కఠిన చిత్తం
కలియుగానికి వారసత్వం ॥
ఎక్కడున్నది మానవత్వం?

బక్కచిక్కిన డొక్కలెండిన
శాట్రపక్కన మూల్గుచుండిన
సాటిమానవునాదరించని
సంఘమందున దాగియున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

పశువుకున్నది పక్షికున్నది
ప్రకృతిలో ప్రతిజీవికున్నది
మమతయన్నది సమతయన్నది
మనిషిలో నశియించుచున్నది ॥
ఎక్కడున్నది మానవత్వం?

• • •

ధర్మక్షేత్రం - కర్మసూత్రం

బ్రతుకు దెరువుకే నోచని
భారతీయ సోదరుడా
రత్నగర్భలోబుట్టి ని
ర్భాగ్యుడో స్నేహితుడా

ఈ దేశం నీకిచ్చే
సందేశం విన్నావా?
ప్రభోధాలలో దాగిన
పరమార్థం కన్నావా?

"అనిత్యాని శరీరాణి
అన్నసూక్తి మరువవద్దు
క్షణికమైన జీవితాన
సౌఖ్యాలాశింపవద్దు

ఐహిక చింతల్లోబడి
ఆముష్మికమును వదలకు
ఆకలితో చస్తున్నా
ఆధ్యాత్మిక చింతవిడకు

నొసటి వ్రాత తప్పించే
పసగల వాడెవ్వడోయి?
ఆదిమహావిష్ణువైన
అనుభవించి తీరునోయి

పూర్వజన్మ సుకృతమ్మా
పుడమిని జన్మింపగనుట
కష్టమైన సుఖమైనా
కర్మ ఫలమ్మని కొమ్మిట

శివుని ఆజ్ఞలేకుంటే
చీమైనా కుట్టేనా
నారుబోసినట్టివాడు
నీరుబోయ కుండేనా

విధిలిఖితాన్నెదిరించకు
విపరీతం సృష్టించకు
వర్ణాశ్రమ ధర్మాలను
వ్యర్థంగా భావించకు

కులధర్మం విడనాడకు
గురుబోధల తెగినాడకు
పురాణాల గాథలనే
పుక్కిటిగా తలపోయకు

ఆశలకే లోనుగాకు
అనర్థాలు సృష్టించకు
దైవనిర్ణయాలెప్పుడు
తప్పింపగ చూడబోకు

లోకం పోకడ తెలియక
లోపాలన్వేషింపకు
వాట మెరుగలేక నీవు
యేటికి ఎదురీదబోకు"

అంటున్నది నీదేశం
ఆధ్యాత్మిక పద కోశం
కడగండ్లను మరిపించే
కైవల్యపు సందేశం

పురాణాలు ప్రబంధాలు
పుట్టినదీ పుణ్యభూమి
వేదాంతపు సారమెల్ల
వెదజల్లిన కర్మభూమి

నీదు జన్మభూమికన్న
లేదట నాకమ్మెక్కడ
నీదు సంస్కృతిని మించిన
దేదీ లేదట యిక్కడ

ఇంతకన్న మహదాభాగ్య
మేమున్నది లోకంలో
ప్రాచీనపుటను భూతుల
ప్రస్తుతాన్ని మరచుటలో

నీకెవ్వరు సాటిరారు
నిన్నెవ్వరు మించలేరు
నీదేశ ప్రాశస్త్య
మెవ్వరధిగమింపలేరు

భుక్తి ముక్తి రక్తుల కుప
యుక్తమైన మార్గంలో
బాశాలను సృష్టించిన
పావని నీ జన్మభూమి

చెట్టుకైన పుట్టకైన
చేతులెత్తి ప్రమొక్కుతుంది
భక్తి పారవశ్యంలో
పరాకాష్ఠనందుకుంది

సంస్కరణల పేరువిన్న
సంక్షుభితమౌతున్నది
సమసమాజమంటేనే
సమ్మతింపలేకున్నది

తల్లివాలని విలపిస్తూ
తరతరాలు కుమిలేవా?

ఉజ్జ్వల భవితవ్యానికి
ఉపాయాలు వెదికేవా?

ఇది చేదువఁందు - సేవించు వఁందు

లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా
భావిపౌరుడవన్నమాట మరువద్దురా
పడుచుగుండెలనెల్ల పరవళ్ళ్రొక్కించి
ఉడుకు రక్తపుధారలరక లెత్తించాలి
త్యాగశీలముబెంచి భోగలాలసద్రుంచి
ప్రగతి సాధింపగా ప్రతిన చేఁయించాలి!
కరకణంకట్టాలిరా నేటి యువతరం
అంకితం కావాలిరా జాతికోసరం
జన్మభూమిని నీవు మరచిపోవద్దురా
జాతీయ భావమును విడనాడ వద్దురా
పలుకరా ఒకసారి వందేమాతరమ్
మొలకెత్తురామదిని మందే రాజ్యమ్
తరతరాలచరిత్ర తారతమ్యము లెరిగి
భరతజాతి పవిత్రభావ సంస్కృతులెరిగి
మానవత్వములోని మహితతత్వమునెరిగి
దీనజనగణములో క్షీణసత్వమునెరిగి
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

జాతిమతభేదాల జాడ్యమును వదలించి
జకుగొంకులులేక సంకుచితములు చించి

బూజుబట్టిన పాతబుట్టలను దులిపించి
రాజకీయ ద్వేషబీజములు తొలగించి
లేవరా తమ్ముడూ లేటుచేయదురా

కూడుగుడ్డలకన్న కులగోత్రములుమిన్న
అనుకున్న దేశాన ఐకమత్యముసున్న
కులము లెప్పుడు నీకు కూడుబెట్టవురా
మమత సమతలు దానికసలు గిట్టవురా
హెచ్చుతగ్గులటన్న చిచ్చురగిలించురా
మానవత మెడకొక్క ఉచ్చుతగిలించురా
మారుతున్న ప్రగతిమార్గాన్ని గుర్తించ
లేకున్నచో సోషలిస్టు కానేకాడు
ఆరిపోయే జ్యోతికాజ్యమ్ములందింప
రాకున్నచో ప్రజారంజకుడు కాలేడు
ముందునడిపించరా యీక్రాంతి రథము
మున్ముందు తీరురా నీ మనోరథము
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

ఎన్నికష్టాలైన దున్నవాడాసామి
ఇకపై ఉండరా దెవ్వడూ భూస్వామి
కష్టించువాడికే కనకాభిషేకమ్ము
దిష్టిబొమ్మలకింక ముష్టి బ్రతుకే సుమ్ము
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

ప్రతినగరమొక్కొక్క భాగ్యనగరముగాగ
ప్రతి పట్టణము పరిశ్రమల నిలయముగాగ
గ్రామగ్రామమ్ము సేవాగ్రామమై వెలయ
గాంధిజీ కన్నట్టికలలు నిజమైపోలయ
పలె పలెయు పంట కలమె సిరులొలయ
ఇల్లిల్లు ఇందిరా మందిరమ్మై వెలయ
ఊరూరు సుందర నందనోద్యానమనిపింప
నోరూరు సిరులతో భారతావని నిగప
ముందుకురకాలిరా యీనాటియువతరం
ఉందిరా మున్ముందు మజిలీ మహత్తరం
ఏకమైవుండాలి నేడుమనమందరం
నాకలోకంకన్న కావాలి సుందరం
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

ఒక కంట అంగారమొక కంట శృంగార
మొలికించు యువకుడా తలక్రిందుగాబోకు
కట్నాలమైకమున కర్తవ్యమును విడకు
పట్నవాసపు మేడిపళ్ళకై పునబడకు
ఈడువచ్చిన కోడెదూడవనుకుంటారు
కూతకొచ్చిన కోడిపుంజువనికొంటారు
జోరి గొప్పదటంచుడప్పకొట్టకురా
సంతనుంచిన వింతజంతువై పోకురా
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

ఓలిచ్చి కొన్నట్టి ఆలిమిక్కిలి చొక
ఇల్లరికమున్నట్టి అల్లుడింకా చొక
పరులసొత్తుకు నీవు బానిసవుకాకురా
పరువంత గంగలో పారబోయకురా
సారాకు నీరాకు దాసోహమనబోకు
జారుపైటలుజూచి బేజారుకాబోకు
కులుకునడలకు భ్రమసి గోతిలోపడకురా
వలపు మంటలలోన శలభమైపోకురా
మురిపాల జీవితం మురికిచేయద్దురా
విరిశెన్నె భ్రతుకులో విషంపోయద్దురా
తాళికట్టినదాన్ని తాకట్టుబెట్టకు
ధర్మరాజుకు నీవు తమ్ముడనిపించకు
చీటాట మోజులో చితికిపోవదురా
ఇల్లువాకిలిగూడ గుల్లచేయద్దురా
లేపరా తమ్ముడూ లేటుచేయద్దురా

భరత పౌరుడవీవు భావివారసుడవు
సిరులు పండింపగల సిద్ధహస్తుడవు
పెడదారిలో నీవు పడబోకు తమ్ముడూ
పెన్నిధులకై భ్రతుకుకాకూడదమ్ముడు
ఉద్యోగములకొరకు ఊగులాడద్దురా
పదవికోసం నీవు ప్రాకులాడద్దురా
జీవనోపాధికై స్వచ్ఛంద వృత్తుల్ని
చేపట్టినప్పుడే జీవితం ముద్దురా
లేవరా తమ్ముడూ లేటు చేయద్దురా

జరుగుతుండేమిటో పరికించిచూడు
జాగరూకుడవగుచు యోచించునేడు
స్విస్‌మేడు వాచీలు స్పెన్సర్సు టార్చీలు
జాపాను నై లెక్సు జర్మనీ ఐటెక్సు
పొరుగింటకూరకై బులపాటమొద్దురా
సిరులన్ని పరులచేజిక్కింపవద్దురా
దొంగవ్యాపారులకు దోహదమ్మీయకు
సాంఘికోత్పతనానికిది యేకుమేకు
ఊడిగానికి నీవు పాడెగట్టించరా
వృత్తినిర్వహణకై నడుముదట్టించరా
జాతికోసమ్మొక్క జ్యోతిముట్టించరా
కుటిలకుల పర్వతాల్ పగులగొట్టించరా
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

దేవుడిచ్చినగాని పూజారి వరమీడు
దేవురించినగాని దర్శనముకానీడు
లంచమిస్తేగాని వంచినతలెత్తడు
పొంచికూర్చున్నట్టి వంచకమ్మితడు
గోముఖవ్యాఘ్రాలు గుటక లేస్తున్నాయి
సందుదొరికిందంటె చప్పరించేస్తాయి
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

కొల్లగొట్టేవాళ్ళ ఆటకట్టించాలి
నల్లధనమున్నట్టి కోటగొట్టించాలి
సాటివాణ్ణింకొకడు దోచుకోరాదురా

జాతీయ సంపదను దాచుకోరాదురా
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

బలహీన వర్గాల బ్రతుకు పండించాలి
కలగన్న స్వర్గాలనిలకు రప్పించాలి
ఋణవిముక్తులజేసి ఋజువర్తనమునేర్పి
గణతంత్రరాజ్య సద్గుణము చాటించాలి
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

కూటికీ గుడ్డకూ కరువురాకుండాలి
తలదాచుకొననీడ తరుగులేకుండాలి
కాటువేసేవాణ్ణి కనిపెట్టుతుండాలి
కీటకారేనరుల పసిగట్టుతుండాలి
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

సిద్ధులిచ్చారీప్రసిద్ధమూ చేనుమందు
దీన్ని తాగించరా జాతిచిడ్డకుమందు
ముదిరిపోయిన చిలిపి జాడ్యానికీమందు
ముచ్చటగకుదిరింది భారతావనియందు
చీడపురుగులకిదే సిసలైన ఔషధం
చితికిపోయిన జాతికిది సిద్ధమకరధ్వజం
చెదుగావున్నదని చీదరించకురా
ఆరగించినవాళ్ళకారోగ్యమబ్బురా
లేవరా తమ్ముడూ లేటు చేయద్దురా

అవినీతి క్రాంతికు నంత మొందిస్తుంది
అభ్యుదయ టానికు లా ఉపకరిస్తుంది
మింగ లేడని పడకు బెంగతో కంగారు
అంగిటనుపడినంత అమృతమ్ముగామారు
ఘాటైన మూలికలు కలిసేనీమందులో
లేటైనచో ఘాటుతరుగును లేశమింతులో
అనుపానమేదైన కలిపి త్రాగించరా
అత్యవసరమ్మన్నమాట గుర్తించరా
సర్వమానవకులము సౌఖ్యమందాలిరా
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

పూరిగుడిసెలు నేడు భూరిసౌధాలతో
వియ్యమందాలిరా తియ్యగుండాలిరా
ఆర్థిక్రపగతిలో అసమానతలుమాసి
లేయరా తమ్ముడూ లేటుచేయద్దురా

తిండిబోతువుగాకు పండుబోతువుగాకు
పారుబోతువుగాకు వదరుబోతువుగాకు
ఈ పోతులన్నిటికన్న ఎనుబోతుమిన్నరా
కర్తవ్యసూత్రాన కట్టుబడిదున్నరా
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No.
Date
CUDDAPAH.

తిమిరమ్ముతో నీవు సమరమ్ము సాగించు
సమసమాజపు విజయశంఖమును మ్రోగించు
మమతామృతము చల్లి మానవత్వము పెంచు
అమరులకు నైతమిది ఆదర్శమనిపించు
లేవరా తమ్ముడూ లేటుచేయద్దురా
భావిపౌరుడవన్నమాట మరువద్దురా!

• • •

వేషం - ద్వేషం

శుద్ధ ఖద్దరులాల్చి
శ్రద్ధమీరగదాల్చి
కవిగోష్ఠికరుగు చెలి
కానివంకకు జూచి

నిలువెల్ల పరికించి
నిట్టూర్పులూర్జించి
చిరునవ్వులొలికించి
స్నేహితుండిట్లనియె

మిత్రమా! నీవెంత
మాత్రమును లోకాను
భవము నార్జింపకే
బ్రతక జూస్తున్నావు

గాంధేయ సూత్రాల
కడ్డుగైన జవదాటి
నడువనంటున్నావు
మడిగట్టుకున్నావు

ఆమహాత్మునితోడ
నాదర్శములుగూడ
దివికేగెననుమాట
తెలిసికొనకున్నావు

పగటి వేషమ్మొకటి
మిగిలింది నీకిచట
పరమార్థములు పటా
పంచలైపోయెనిట

శాంత్యహింసలు లేని
సత్యాగ్రహము మిగిలె
సమభావమే లేని
సామ్యవాదము రగిలే

ఓట్లకో సీట్లకో
రూట్ల పర్మిట్లకో
పదవికో పెదవికో
పరితపించేవారి

కుండవలె నీవేష
ముండవలె నీభూష
లెందుకయ్యా నీకు
లేనిపోని జిగీష

పాపపంకిలమెల్ల
బయలుపడనీకుండ
ముసుగులో గుట్టంత
మూసివేసేనేత

కుండవలె నీవేష
ముండవలె నీభూష
లెందుకయ్యానీకు
లేనిపోని జిగీష

పెద్దరికమునకైన
పెట్టుబడులకునైన
ముప్పేమిరాకుండ
తప్పించుకొను ఘనుల

కుండవలె నీవేష
ముండవలె నీభూష
లెందుకయ్యానీకు
లేనిపోని జిగీష

రాజకీయపు చెత్తు
రమణి'రమ్మ'ల మత్తు
ఐరుగజాలని వాని
కెందుకీ మద్దత్తు

కలవారి వేషమిది
కలుష సంహారియిది
వెలగట్టలేనంత
విలువైన ఖాదియిది

కల్లనిజమొనరింప
గల్గు సాధనమిద్ది
దుష్టులైననుగాని
శిష్టుడనిపించునిది

చౌకగా దొరుకునా
జూకుదుసులు వదలి
మూన్నాళ్ళకే చిగురు
ముతకబట్టలు గట్టి

వేలాది కార్మికుల
వీధి బట్టింతువా
ఆలుబిడ్డలనెల్ల
జోలె గట్టింతువా

నిరుద్యోగ సమస్య
నిర్మూలనము సేయ
తరముగాదిక భావి
తరమువారలకైన

అని హేతుబద్ధముగ
వినిపింప మొదలిడిన
హితునితోననియె న్నే
హితుడు వినయము మీర

వినవోయి మిత్రమా!
విపరింతు ఖద్దరున
కున్న సుగుణములు నీ
వెన్నడూహింపనివి

శ్రమజీవులకు తిండి
సమకూర్పగల్గునిది
స్వేద బిందువులూడ్చి
మోదమొనగూర్చునిది

స్వాతంత్ర్యసమరమ్ము
సాగించు యోధులకు
ప్రపధమ బాణమిది
ప్రాణ సంకాశమిది

అనుచునింకేమేమొ
అభినుతులుగావించి
ఖాదీ మహాత్మ్యమే
కర్వుబెట్టగ సాగె

అంతలోనటనున్న
అర్ధనగ్న శరీరు
లవిరళ శ్రమజీవు
లనిరి వారల కిట్లు

ఒంటి నిండాకట్టు
కుంటానికే లేక
చిరుగుపాతల్లోన
సిగ్గుదాచగ లేక

ప్రాత రాతి యుగాన్ని
ప్రత్యక్ష మొనరించి
బ్రతుకు సాగిస్తున్న
భారతీయుల మేము

ఎండ వానలకైన
ఎదిరించి నిలిచేము
కట్టుబట్టలగూర్చి
క్షణము తలపగ లేము

వలదయ్య వలదుమీ
వాదోపవాదములు
వేషమ్ముపైనింత
ద్వేషాభిమానములు

క్రిమిసంహారిణి

చీడపురుగు నివారించడానికి
సింథటిక్ డ్రగ్స్ ఎన్నోఉన్నాగాని
చీకటి వ్యాపార నిరోధానికి
సిద్ధౌషధాలెక్కడున్నై?
కీటక సంహారిణి ప్రయోగించి
తాటక సందోహాన్ని వధించగలమా?
ఎలుకలబోనెంత పెద్దదైనా
ఏనుగుల్ని బంధించగలమా?
క్రిమి సంహారక మందులన్నీ
కీటకాహారంగా మారుతున్నట్లే
ప్రభుత్వంచేసే ప్రకటనలన్నీ
పందికొక్కులకు
ప్రబోధాలౌతున్నాయ్
మంత్రాలకు
చింతకాయలు రాలేనా?
శ్రీరంగ నీతులకు
చిత్తశుద్ధి కుదిరేనా?
ఆహారంలో కల్తీ
వ్యాపారంలో కల్తీ
రాజకీయ వ్యవహారంలో

రోజుకో రకం కల్తీ
దినుసుల్లో కల్తీ
మనుషుల మనసుల్లో కల్తీ
మమతల్లో కల్తీ
మాతృహృదయంలో సైతం కల్తీ
నోటిమాటల్లోనే కాదు
ఘాటు ప్రేమల్లోనూ కల్తీ
నాగరిక ప్రపంచంలో
నరుల ప్రబుద్ధతా కల్తీ
కల్తీ నిరోధానికి
కంకణం కట్టే సరికి
శాల్తీలే కనబడవు
పాపులేవీ తెరువబడవు
శాంపిల్స్‌కు హెల్త్‌ఫీసరు
క్యాంపు చేయబోతుంటే
మునుముందే హెచ్చరిక
ముడుపులు చెల్లింతురిక
లంచాలకు తలవంచనివాడలౌకికుడు
వంచనతో జీవించేవాడతి లౌకికుడు
చిన్ననాటి స్మృతులన్నీ
చిత్రంగా వర్ణస్ఫూర్తింది వృద్ధ జంబుకం
విన్నదంతా విశ్వసింపలేక
వెక్కిరిస్తుంది యువభల్లూకం

ఇంతులిద్దరొక చోట జేరితే
అంతు లేని ఆలోచన
రేషనింగు షాపుల్లో
రేపేమిస్తారన్న దే యోచన
ముక్కుపోయిన పాత అక్కుళ్ళకోసం
ముతకోకరాగుడ్డ ముక్కలకోసం
'క్యూ'లోన మోకాళ్ళ నొప్పులొచ్చాయి
కూడుగుడ్డలకెన్ని తిప్పలొచ్చాయి?
ఆఫీసు కనుదినం
ఆలస్యమౌతున్న
యింటాయనకు ముట్టు
ఇంగ్లీషు చీవాట్లు
బడికి లేటౌతున్న
పాపాయిలందరికి
పంతులయ్యల తిట్లు
పదుగురిలో నగుబాట్లు
ఉద్యోగి బ్రతుకంత ఊబి
ఉన్నవాడికదెంతో హాబి
రేషన్ల కోసమే లీవంతఖర్చు
కాషన్లతోగడుపు సర్వీసురొచ్చు
బరువైన బ్రతు కెట్లు
భరియింపవచ్చునని
కరువుతో యీ జీవి
కడతేరవచ్చునని

అనుకుంటున్న
అంగనల హృదయాలు
క్రుంగిపోయాయి
బంగారు కలలన్ని
భగ్నమయ్యాయి

అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా, ఆడపిల్లా
అన్నీ కవితావస్తువులన్నాడో మహాకవి
అన్నీ కలితీ వస్తువులంటున్నాడు భగ్నజీవి
కల్తీ సరుకుల పంపిణీకి స్వైతం
కర్మసూత్రం వల్లిస్తాడు సిద్ధాంతి
ధర్మసూక్ష్మం బోధిస్తాడు వేదాంతి
సిద్ధాంతులు ప్లస్ వేదాంతులు
ఈక్వల్ టు బడిపంతులు
బడిని గుడిగావించి

భక్తి రసమును నించి
బాగుచేస్తాడంట దేశం
భావితరమునకిది ముక్తి సందేశం
ఆత్మశుద్ధిని మరచి
ఆచారమును వలచి

వెట్టితలలేస్తుంది మతమ్—ప్రజలలో
వైరమును పెంచుతుందనవరతము

జీజస్‌కు పెట్టిన ముళ్ళకిరీటం
జాతిపితకు తెరిచిన మృత్యు కవాటం
మతోన్మాదమిచ్చిన ఘనసన్మానం
మానవతకిది తీరని అవమానం

కర్మసూత్రము దలచి
కర్తవ్యమే మరచి
సోమరితనమ్ములో
సొమ్మసిల్లెను జాతి
జాతిలత కెన్నెన్ని
జాడ్యాలు సోకాయి
మొక్కలోనే యెన్ని
చిక్కులొచ్చాయి
పురిటిలోనే సంధి
పెరటిలో తగిలింది
చిగురించులత కెంత
చేటుమూడింది?
ముడత తెగులొక వంక
మిడతదండొక వంక
చీడపురుగీతి
చిగురు నాకేస్తుంది
కాడలన్నీ మేసి
మోడు జేసేస్తుంది
జాతినే కబళించి
మూతిముడిచేస్తుంది

జాడకనబడకుండ
పాడుజేసేస్తుంది
లేకరా తమ్ముడూ
లేదీగ రక్షించ
వేరునాటిన పురుగు
వేగమే శిక్షింప
మనిషిలో ఎక్కడో
మూరు మూలన దాగి
నిదురించు మానవత
మేలు కొల్పాలి
సమతమమతలు నించి
సహన శీలము పెంచి
కులమతాలను త్రుంచి
కుళ్ళు తోడాలి
యువతరం ముందడుగు వేయాలి
నవసమాజ సృష్టి చేయాలి
సొంతలాభం కొంత విడవాలి
సోషలిజమే ఊతకావాలి
సమసమాజం నిలువబెట్టాలి
సౌభాగ్యమందరూ పొందాలి
చాటుమాటుగ జనుల
కాటువేసే మేటి
సంఘ విద్రోహుల్ని
తరిమి కొట్టాలి

జాతి కంటిన చీడ
నీతిమాలిన పీడ
నేటితో వదలాలి
తెగులు బట్టిన జాడ
సగటు మనిషికి దిగులు తొలగిపోవాలి
స్వర్గలోకం భువికి సాగిరావాలి

• • •

పుణ్యాధాత్రిలో భరతపుత్రి

శ్రీనాథుడేనాడో వాపోయాడట పాపం
స్త్రీగా పుడితే జీవితమే పూలబాటయ్యేదని
ఉన్నత పదవుల్లోనూ
ఉపాధి కల్పనలోనూ
ఉజ్వల భవిష్యత్తు
నూహించాడట మహాకవి
సీరజాక్షుల ఓరచూపులముందు
కవితా గానాలు
కాబోవన్నాడట వీనులవిందు
పుంస్త్వాలూ పౌరుషాలు
నిరర్థకాలన్నాడట
పూబోడులు ఒయ్యారాలకు
పురుషోత్తముడైనా దాసుడేనన్నాడట
ఇనుప కచ్చడాల మునిపుంగవుల్ని సైతం
కనుసైగతో కవ్వించే జవరాండ్ర
జీవితాలే సార్థకాలన్నాడట
పదిహేనోశతాబ్దంనాటిమాట
ప్రస్తుతానికీ మరుపురాకుండా దాచిన మూట
కాలగతిమారినా
కవివాక్కు చెరగని ధ్వని

మనిషి కునారిల్లుతున్నా
మదిలోని కోర్కె-తరగనిగని
అపూర్వవిజ్ఞానాన్నార్జించినా
అరిషడ్వర్గాలనరికట్టలేని మానవుడు
నవనాగరికత ముసుగులో
నాజూగ్గా దాక్కున్న దానవుడు
అబలలంటే అతగాడికెంతో అభిమానం
అయినవాళ్ళమీద మాత్రం
అంతులేని అనుమానం
ఇంటర్వ్యూ కోసం వచ్చిన
యింతుల ముఖం చూడగానే
ఎంతటి ప్రశ్నల వర్షమైనా
ఇట్టే వెలిసిపోతుంది
పటాపంచలౌతాయి
పైళ్ళకారు మేఘాలు
తారుమారవుతాయి
కోపతాపాల గర్జనలూ తర్జనలూ
భీకరాకారం
ప్రసన్న వదనం ధరిస్తుంది
రాకా చంద్రునిలా
చిరునవ్వుల వెన్నెలలు కురుస్తుంది
నియమాలూ నిబంధనలూ
నీరుగారి పోతాయి
నయనాలే సవాళ్ళకు

C.P. BROWN MEMORIAL LIBRARY Acc. No. 10/ Class CUDDAPAH

జవాబులు వెదుక్కుంటాయి

చట్టాలెంతగట్టివైనా

సడలిపోక తప్పదు

పట్టుమని పదిప్రశ్నలు

అడగటానికి మనసొప్పదు

మెరిటోరియస్ పీపుల్

దరిదాపుల్లోకనిపించరు

శ్రీరామ భ్రాతలు సైతం

స్త్రీమూర్తిని గౌరవించరు

ముడుపులు చెల్లిస్తామని

మొక్కితే చాలట ఆదేవుడికి

ముందుగానే రొక్కం

ముట్టజెప్పక తప్పదట యీ మానవుడికి

కార్యసిద్ధికి మానధనాలే

కానోపు ప్రధాన సాధనాలు

మానవతులకు మాత్రం

కానుకలో కన్నెషనుంటుందిగాబోలు

పరవనితా సముద్ధరణకు

బద్ధ కంకణులీ ఘనులు

స్వజనానికి మాత్రం

స్వాతంత్ర్యమీయని త్యాగధనులు

పరాయి వనితను

పవిత్రమాతృమూర్తి గా చూడమనే గడ్డమీద

కిరాయిగట్టి పళ్ళిగిలించడమే
జరుగుతున్న మర్యాద
కీచక సందోహంతో
క్రిక్కిరిసిపోతుంది పుణ్యధాత్రి
యాచకత్వంలో సైతం
ఎదురొక్కంటుంది కామాంధుల్ని భరతపుత్రి

• • •

మధుశాల

భావుకత్వపుద్రాక్ష
తీవలన్నిటినేర్చి
కల్పనా సవము సే
కరణమొనరించితిని

కవితనొక మధుపాత్ర
గావించి నించితిని
కవిని విక్రేతనై
కదలి విచ్చేసితిని

లక్షలాదిగ జనులు
ద్రాక్షాసవము గ్రోల
అణుమాత్రమైన తరు
గనిది యీ మధుపాత్ర

పాఠకావళి రసా
స్వాదనమ్మొనరించు
మదిరాలయమ్ము నా
యెదలోని కావ్యమ్ము

మధురతర భావనా
మధుర మధురనమునే
నిత్య నూతనముగ వి
నిర్మింతుననుదినము

కల్పనా బాహువుల
కవితా సవమ్ముగొని
దగగొన్నహృదయ పా
త్రను నింపుకొనియెదను

నశాలను నేను
పానీయమును నేను
విక్రేతనేను నే
వించువాడను నేను

మమతసమతల రూపు
మాపు మతగ్రంథాల
మంటగలిపినదెవని
మదినిరేగిన జ్వాల

ఎవడు గుడిగోపురా
లవలీలగా గూల్చె
ఎవడు చర్చి మసీదు
భవనాల నిలరాల్చె

పాదరీలిస్లామ
పండితులు వేదాంతు
లెత్తుయెత్తుల నెవడు
చిత్తుచిత్తొనరించె

వాసికీ గ్రింథమా
హ్వానమిపుడందించు
స్వాగతమ్మును బలికి
నన్నుతులు గావించు

వేరువేరు మతాల
వారికై ననుగాని
మధుపాత్రి ఒక్కటే
మధురసమ్మొక్కటే

ఐకమత్యముచంపి
అన్నదమ్ములలోన
కలహాలురేపు దే
వాలయాలిలపైన

ద్వేషభావము పెంచు
దేవళమ్ములకన్న
మమత పండించునా
మధుశాలయేమిన్న

[హిందీ కవి 'బచ్చన్' కవితకు అనుకరణ]

దీపప్రకాశం దివ్యసందేశం

అలనాటి పలనాటి
తెలుగు జోదులకన్న
వెలనాటినేలు బె
బ్బులుల శౌర్యమునకన్న

బాలచంద్రునికన్న
బ్రహ్మనాయనికన్న
తాండ్ర పాపయకన్న
ధర్మరాయనికన్న

ఆంధ్రకేసరిమిన్న
అతని గర్జనవిన్న
ఆంగ్లప్రభుతకు గుండె
లదరిపోయినవన్న!

సాహసౌదార్యాల
సాటిలేని ఘనుండు
స్వార్థమెరుగని భరత
స్వాతంత్ర్య యోధుండు

అతడు చూపిన బాట
ఆదర్శమేనాటి
అనుగమించుడటంచు
జనులనుద్బోధించు

పత్రికలు నినుగూర్చి
ప్రతిదినము పొగడినవి
తాళఫలమంతక్ష
రాల ప్రచురించినవి

దశదిశల నీకీర్తి
దద్దరిలిపోయింది
మారుమూలల గ్రామ
సీమకెగ్గ బాకింది

శతజయంతిని జరిపి
శ్రద్ధాంజలిని ఘటించి
పాలరాలను విగ్ర
హాలుగా మలిపించి

నడిబజారున నిన్ను
నిలబెట్టి పూజించి
హారతులుబట్టి ని
న్నర్చించి మెప్పించి

దేశభక్తినిచాటు
తెలుగు లోకమెల్ల
లక్షలకు లక్షలే
వెచ్చించె ధనమెల్ల

ఊరూర నీపేర
ఉత్సవాల్ జరిపించి
ఇళ్ళకును బళ్ళకును
జిల్లాకు నీపేరు

పెట్టి పెద్దలునిన్ను
ప్రస్తుతించిరి చూడు
ఇంకేమి కావలయు
నింతకంటెను నేడు

నేటికైననుగాని
నీకుటుంబము జూడ
చాటుచున్నది నీదు
మేటి త్యాగధనమ్ము

నీకుటుంబమ్మేట
గలిసితేనేమాయె
పత్రికలు మముగూర్చి
ప్రకటించితే చాలు

తనువెల్ల - దహియించి
దశదిశల వెలిగించు
దీప ప్రకాశమా!
దివ్య సందేశమా!

ఈ తెలుగు - నాటిలో
ఇరులలము వీటిలో
నూత్న విద్యుల్లతా
జ్యోత్స్న వెదజల్లుమా!

సౌమ్యావాది సవమవర్తి

నీపేరు విన్నంత
వీరేడు భువనాల
ప్రాణులన్నియు భయ
భ్రాంతమై విలపించు

నీఒడిని హాయిగా
నిదురబోనిదెవండు?
నీమమతచవిజూడ
నోచుకోనిదెవండు?

రాజునేగాదు బై
రాగినై ననుగాని
రాణినేగాదు ని
ర్భాగ్యకాలినిగాని

దరిజేర్చుకొందు వె
వ్వారినేమర వీవు
పక్షపాతమే లేని
పాలనా దక్షుడవు

కష్టాలపాలైన
ప్రభ్వులను సైతమ్మ
కొగిటను జేర్చుకొను
కరుణార్ద్రహృదయుడవు

నీసర్వ సమదృష్టి
ఎరుగునా యీసృష్టి
మరణ మెప్పటికైన
శరణమను సంతుష్టి

దోషాల నెప్పుడ
న్వేషించు మానవుని
తలకెక్కునా నీతి
తత్వాలు బోధింప?

రమణి వలువలనూడ్చి
రచ్చలో కీడ్పించి
గాంధి బొమ్మకు నమ
స్కారాలు చేయించు

దుశ్శాసనుని ప్రభాత
దుష్టప్రజానేత
రాజకీయ ద్వేష
రహితుడని భావించి

మంచితనమును వెల్లి
డించుచుందువు నీవు
ఘోరకృత్యాలన్ని
గుర్తునకు రానీవు

ఆగర్భ శత్రుత్వ
మైన మరపించేవు
ఆహ్లాదముగ మెప్పు
లందింపజేసేవు

దుష్టుడైనను పరమ
శిష్టునిగ చిత్రించి
సానుభూతిని జూపు
సహృదయుడవు నీవు

సృష్టిలో నీకన్న
సోషలిస్టింకెవడు
సమధర్మమును చాటు
సామ్యవాదింకెవడు

సైంటిష్టులెన్నో పరి
శోధనలు చేశారు
ఔషధుల తోడని
న్నరికట్ట జూచారు

క్షీరసాగర మెల్ల
చిలికి సంపాదించు
అమృతమ్ముతో యెంద
రమరులైయున్నారు?

అయిన నీగొప్పతన
మంగీకరింతురా?
మృత్యు దేవానిన్ను
మెచ్చుకొనబోదురా?

◆ ◆ ◆ ◆

స్వర్గదపిగరీయసి

విశాలాంధ్ర అవతరణం
విజ్ఞతకొక నిదర్శనం
చిక్కులెన్ని యెదురైనా
చెక్కుచెదరదీ రాష్ట్రం

అమ్మమీద యెంత మమత
ఆంధ్రుల హృదయాలలోన
ముక్కలైనచేసి మాతృ
మూర్తిని సేవించాలని

ఉన్నమాట తలచిల పె
ల్లుబుకుతుంది ఆవేదన
ఎన్నెన్నో కలలుగన్న
ఎదలోపలి ఆక్రందన

అలనాటిది ఆరాటం
ఐక్యతకై ఉబలాటం
సమగ్రాంధ్రభూమి కొరకు
సాగించిన పోరాటం

నిన్నటిదొక వక్రపథం
కన్నబిడ్డ మనోరథం
తల్లిభూమియేమైనా
తన పదవియె సర్వస్వం

అధికార వ్యామోహం
ఆత్మీయత నణగార్చెను
స్వార్థం మితిమీరిపోయి
సౌజన్యం హతమార్చెను

అన్నదమ్ములన్నభావ
మైకమత్యమే నశించి
జన్మభూమి మాటమరచ
జాతిని వంచించి పొంచి

కన్నతల్లి మరచేరా
వెన్నుపోటు పొడిచేరా
రాజకీయ ద్వేషంతో
రంగు ఫిరాయించేరా?

అమ్మా ఓ ఆంధ్రమాత!
అనుగుబిడ్డలెంతెంతటి
గ్రంథసాంగులైనారో
కళ్ళారా చూడవమ్మ!

గాంధీ భక్తులమంటూ
బ్రాంతీపావుల దూరే
సైంధవ బ్రాతలు కొందరు
కలరందురు మానేతలు

హరిజన సంక్షేమానికి
అరుదెంచిన పుణ్యమూర్తి
పిల్లల హాష్టలు పేరిట
కొల్లలుగ గడియించె నొకడు

పగలంతా భక్తిరసం
రాత్రికి రమణుల సరసం
పన్నీటను జలకమాడు
బాబాయై వెలసెనొకడు

ప్రభుత్వాన్ని కన్నుగప్పి
పన్నులకెగవేత బెట్టి
పాపార్జితమందు పాలు
పంచును 'వెంకన్న' కొకడు

ఇల్లెందరో నీతనయులు
పేరందిన మహనీయులు
సమాజాన్ని తీర్చిదిద్ద
సమకట్టిన మహోదయులు

వీరందరినేకీతిగ
నిరోధింతువో తల్లీ!
మదినిండిన కల్మషాన్ని
మాయింతువో కల్పవల్లి!

సశ్యశ్యామల క్షేత్రం
స్వర్గసమమ్మగు గాత్రం
అయినా నీయింట తగ్గ
దన్నార్తుల గోడు మాత్రం

ఇజాలెన్ని భువి వెలసిన
ఏమిటి ఫలితం తలీ
సామాన్యుల జీవితాలు
చక్కబడేనా మళ్ళీ?

పేదరికం రూపుమాసి
పెన్నిధులింటింట వెలసి
మారుమూల గ్రామమైన
మహోన్నత్య మందినపుడు

విశాలాంధ్ర జననీ! నీ
విఖ్యాతిని వినుతింతుము
చిరకాలపు వాంఛితములు
సిద్ధించినవని యెంతుము

వింతకోర్కె

తలనెరిసిన పంతులమ్మ
తలపుల్లో యెంతవింత
"చూచారా మేష్టారూ!
శుష్కరాజకీయమ్ములు

గాంధి మహాత్ముడు చేసిన
ఘనకార్యం ఏమున్నది?
హరిజనులకు నేటికిని
ఒరిగిపడిందేమున్నది?

సోషలిజం పేరెక్కడ
చూచిన వినిపిస్తున్నది
కులతత్వం నానాటికి
బలవత్తరమౌతున్నది

ఉన్నవాడు నానాడు స
మున్నతుడై పోతుంటే
లేనివాడు పశువుకన్న
హీనంగా జీవించే

దేశంలో స్వాతంత్ర్యం
దేనికో ప్రజాతంత్రం
ఓటుహక్కు మనకెందుకు
నోట్లుక్కమ్మకునే బ్రతుకు?

ఆంగ్లేయుల పాలనమే
ఆనందంగా గడిచెను
పావలాకు రెండు శేర్లు
పాతబియ్యమే దొరికెను

దొరవారిని ఒంటరిగా
దర్శనమ్మ్ము చేసుకొన్న
కానీఖర్చైన లేక
కాగితాలు నడిచేవే

తెల్లవాళ్ళ పరిపాలన
మళ్ళీవస్తే చాలును
ఆడవాళ్ళమీద వారి
కభిమానం గొప్పదిలే"

అంటూ తన మనసులోని
ఆక్రోశం వెళ్ళబోసి
ఊప్పదిన్న విశ్వాసం
ఒక్కసారి ఒలకబోసె

గుండెలనే పిడిచినట్లు
గునపమ్ములా బొడిచినట్లు
విలవిలలాడెను మేష్టరు
వింతగజూచెమినిష్టరు

ఇరువైదువత్సరాల
పరిపాలన చవిజూచిన
పంతులమ్మగారిట్టుల
పల్కుచున్న దేమాయని

కలవరపడి కోటీచరు
కావించెను ఒకలెక్చరు

హరిజన శ్రేయమె జీవిత
పరమార్థంగా యెంచిన
బాపూజీ ఆత్మకథను
పఠించినట్లేలేదే!

కాలేజీ సీట్లల్లో
ఖాళీ ఉద్యోగాల్లో
బంజర్లను పట్టాలను
పంచిపెట్టు పథకంలో

హరిజనులకు గిరిజనులకు
అగ్రస్థానమ్మిచ్చిరి
పదవుల్లో పాలనలో
ప్రత్యేకత సమకూర్చిరి

సామాజిక జీవితాన
సంస్కరణలు చేయగోరి
వెనుకబడ్డ జీవితాల
మునుముందుకు నడుపగోరి

సాగించేపాలనలో
సైపరాని దోషాలను
సరిదిద్దుట మనధర్మం
లేకుంటే మనకర్మం

పొరుగావిడ మగడెంతో
సరసంగా వున్నాడని
అతడే నామగడంటే
హరి సుందా లోకం?
ఎ—

నీవారిని దిద్దుకొనుట
నీకెప్పుడు సుఖప్రదం
జాతీయాభ్యుదయం యే
జాతికైన కీర్తిప్రదం

నవకవితా కువారీ!

నవరసాలు చవిజూపక
నయగారఫునడలల్లక
మృదుమధుర పదాలనేర్చి
ముద్దులొలుక చిత్రింపక

అలంకార శోభాన్వితు
రాలినిగా నొనరింపక
అష్టాదశవర్ణముల
అందాలను సరిదిద్దక

యమకమ్ముల గిమకమ్ముల
యతిప్రాసలమరింపక
పురాణేతిహాసంబుల
పొందికగా వర్ణింపక

శయ్యాసౌభాగ్యమ్మును
సమకూర్పక తమిదీర్పక
ఛందంలో అందంగా
చతురోక్తులు విసరనీక

రాజులకో మంత్రులలో
రాజకీయ నేతలకో
అంకిత మొనరింప లేక
ఆత్మను వంచింప లేక

కావ్యానికి నిరుపేదల
గాథల నితివృత్తంగా
ఎన్నిన కవిపలుకుల్లో
ఎందుకింత ఆవేశం?

ఊహాసౌధాలలోన
విహరించే కవికుమారి
వాస్తవలోకానికి దిగి
వచ్చితివా వెసారి?

ఆధునికుల భావనలో
ఆవేశం హెచ్చింతువు
ప్రతి పదమున ఆవేదన
ప్రతిధ్వనిత మొనరింతువు

కులమతాల రొంపిలోన
కుళ్ళిన ఈ సంఘంలో
దుర్గంధం సైపలేక
దురంతాలు చూడలేక

మమతలకే తావులేని
మానవ నవసమాజాన
నానాటికి పెరుగుతున్న
నాగరికతకోర్వలేక

రాజకీయ కుతంత్రాల
రహస్యాలు తెలియలేక
రగిలే ఆకలిమంటల
సెగలను చల్లార్పలేక

నిరుద్యోగి నిట్టూర్పులు
నిప్పులుగురిపిస్తుంటే
నిరుపేదల విషాదాలు
నీగుండెలు మండిస్తే

ఆవేశమ్మాపలేక
ఆక్రోశిస్తున్నావా
నవసమాజ నిర్మాణం
నీవిధియనుకున్నావా?

• • • •

బాపూజీ బ్రహ్మాస్త్రం

బాపూజీ నీవిచ్చిన
బ్రహ్మాస్త్రం కడుగొప్పది
ఎంతటి ఘనకార్యమైన
ఇట్టే సాధింపగలది

దోషాలను సైతం ని
ర్దోషంగా చేయగలది
సత్యాగ్రహమన్నది అస
మానమైన దివ్యౌషధి

మారణాయుధాలకన్న
మహనీయమిహ్మాశస్త్రం
దారుణ హింసాకాండకు
దూరమైన దివ్యాస్త్రం

అనుకున్నామిన్ననాళ్ళు
ఆత్రంగా వాడినాము
పాతబడిన అస్త్రమ్మిది
పసలేదని తెలిసినాము

కాలదోషమే పట్టెనో
కలుషాకీర్ణమ్మయ్యెనో
నిరాహారదీక్ష నేడు
నిర్వీర్యమ్మై పోయెను

అణ్వాయుధ యుగంలోన
అహింసకిక తావుందా?
స్వార్థం మితిమీరినపుడు
సత్యం జీవిస్తుందా?

దౌర్జన్యం దోపిడీలు
ధర్నాలూ ఘెరావోలు
శాంత్యహింస సూత్రాలకు
సరికొత్త స్వరూపాలు

నీపాతం మరువకుండ
నిత్యం వల్లిస్తున్నా
ఉద్యమాలపేర జనుల
ఉద్రిక్తుల చేస్తున్నా

అనుకున్నది నెరవేరక
ఆశలు విడనాడలేక
ప్రజాసేవ చేస్తున్నా
ఫలితం మాత్రంసున్నా

కొత్త మంత్రమేదైనా
కొంచం బోధిస్తావా? బాపూజీ!
ప్రభుతనైన లొంగదీయు
పధకం సూచిస్తావా? నేతాజీ!

భస్మాసుర భ్రాతలమై
బ్రతుకులు సాగింపలేము
విజ్ఞత కోల్పోయిరన్న
విఖ్యాతి భరింపలేము

మమతలు పెంపొందించే
మందుంటే చెప్పవయ్య
ద్వేషాగ్నిని చల్లార్చే
ఔషధినందించవయ్య!

• • •

గ్రామ రాజ్యకీ జయంబోలో

ఇది గ్రామరాజ్యం ఇది రామరాజ్యం
గాంధిజీ కలగన్న శాంతి సామ్రాజ్యం
పంచాయితీ రాజ్యపాలనవిధానం
ప్రజారాజ్యానికిది ప్రథమసోపానం
భరతజాతి ప్రగతికిది జీవగట్టి
బాపూజీ పట్టినది యీ చేతికట్టి
పండించువాడికే భూమిపై హక్కు
పనిచేయగలవాడె గద్దెపైకెక్కు
సోమరితనానికిట చోటులేనేలేదు
సహజీవనానికిట లోటురానేరాదు
బంధుప్రీతికి లేదుతావు
ప్రతిబంధకములడ్డురావు
పంచాయతీ రాజ్యపరిపాలనమ్ములో
వంచకులకికపైన చావు
పల్లెటూళ్ళల్లోని ఎన్నికలతంత్రాలు
కుళ్ళగిస్తున్నాయి కుటిల కులగోత్రాలు
బాగుచేయాలి మనగ్రామసీమనునేడు
సాగుచేయాలి కలుపెక్కిపోయిన బీడు
పంటపొలమంతయును కంటకావృతమయ్యె
దంటుమొక్కలుగూడ కంటికగపడవాయె

ముళ్ళన్ని కాల్చి వేయాలి దరిదాపు
కుళ్ళంత తోడిపోయాలి
పంచాయితీ రాజ్యపాలనా సేద్యమున
కంచెలెన్నో చేసుమేయమరిగాయి
వంచకాలకు బొజ్జలెంత పెరిగాయి
ఏరిపారెయ్యాలి కలుపు మొక్కల్ని
వెంటబడి తరమాలి గుంటనక్కల్ని
శుష్కవేదాంతాలు వల్లించవద్దు
ముష్కరుల మూకలతో చేయిగలపద్దు
శ్రమజీవనమ్మన్న వెనుకాడవద్దు
క్రమబద్ధ జీవితం గిడపడంముద్దు.
గ్రామరాజ్యకీ జయ్‌బోలో
గాంధీజీకో మత్ భూలో
సామ్యవాద్‌కీ జయ్‌బోలో
సమసమాజ్‌కో మత్ భూలో

• • • •

పేరునుజూచి పేర్చిమించకు

వెలిసింది ఆనందవర్షం – నట్టేట
గలిసింది ఆంధ్రజన హర్షం
వచ్చింది రాక్షసవత్సరం – నేతలకు
హెచ్చింది రాజ్యాంగ మత్సరం
రాజకీయ సన్యాసుల్లో సైతం
రాగద్వేషాలు రగులుకున్నాయి
సర్వసంగ పరిత్యాగులకు సైతం
చిలిపిరోగాలెన్నో తగులుకున్నాయి
ఆవినీతి నిర్మూలనార్థం – అవనిపై
అవతారమెత్తింది స్వార్థం
ఆవిర్భవించారు మునులు
మేటి ఘనులు
అక్కసుతో'కక్కసు'లోదూకారు
త్యాగధనులు.
గోసాయిలెందరో
గోచులు బిగించారు
ద్వేషానలం
దేశంనిండా రగిలించారు
మంత్రిప్రాణాలకే మూడిందిచేటు
మానవత్వానికేపోయిందిచోటు

ప్రగతి మార్గానికే పట్టింది తువ్వా
ప్రజాస్వామ్యానికే వచ్చిందిముప్పు
సహనానికి సమాధి కడుతుంది మతం
దహనానికి రహదారులు వేస్తుందనవరతం
ఉత్తరాదిన సాగుతుంది
రామలీలా హేల
ప్రత్యుత్తరంగా రేగుతుంది
రావణ లీలాజ్వాల
ప్రాంతీయతత్వం బలవడానికి
పలురకాల టానిక్కులు
కుటిల కులతత్వం నిలవడానికి
కోట్లాది ట్రిక్కులు
మాట్లోమురిపిస్తుంది సమైక్యత
మనసుల్లో క్షీణిస్తుంది సఖ్యత
వేదికల మీద
వేదాంతం వల్లిస్తుంది సోషలిజం
వెట్టి వెంగళప్పల్ని జేస్తుంది చేదునిజం
నాయకులక్కావాలి గద్దె
అనాయకులక్కావాలిముద్ద
పెళ్ళికో ప్రాద్ధానికొక్కటే మంత్రం
పెద్దలు నిర్దేశించారుద్యమాల తంత్రం
చట్టాలకెన్నెన్నో
చాటుమాటుగ తూట్లు
నీతికీ నియమాల కొచ్చాయి అగచాట్లు

తెలుగుతల్లీ!
నిన్నుపట్టుకున్నవేనోళ్ళ తెగుళ్ళు
తొలగునాయికైన
మదిలోని దిగుళ్ళు?
దేశభాషల తెలుగులెస్సన్నమాట
తెలుగువాడికితోచె నేటికీనాట
'ఇటాలియనాఫ్ ది యీస్ట్'న్న సూక్తి
ఏనాటికి చెరిగిపోనిదారోక్తి
ఆనంద ఉగాదినాడు
ఆంధ్రభాషామోషను
అందలమెక్కించారందరు
ఆఫీసుగుమ్మంలోకైనా
అడుగుపెట్టనిచ్చిన వారెందరు?
చులకనైపోయింది తల్లిభాష
చూరుపట్టుకు వ్రేలాడుతుంది
పరభాషా జిగీష
కామాంధుడికి
కన్నతల్లి మనోవ్యధ బోధపడదు
వ్యామోహితుడికి
హితబోధ వినబడదు
పొరుగింటి పుల్లకూర భలేరుచి
పొడరద్దిన మొగం మహాశుచి
పెరటిచెట్టు పనికిరాదుమందుకు

పురిటితోనేర్చినభాష గిట్టదు ఖామందుకు
అమ్మకు "మమ్మా" అంటేనే యిష్టం
అయ్యకు 'డాడీ' అనకుంటే ఎంతోకష్టం
అమ్మాయికి "డార్లింగ్"
అనిపించుకోవాలని తగనిమోజు
అబ్బాయికి వచ్చీరాని
ఆంగ్లపదాలుచ్చరించడం రివాజు
ఉగ్గుబాలతోనేర్చిన భాషమాట్లాడేందుకు
సిగ్గుజెందుతుందాధునిక సమాజం
పదిమందికర్థంకాని రీతిలోపలుకుతుంది
పండితభిషక్కుల భాషాభేషజం
అయినా భయమందకు తల్లీ!
ఆంధ్రత్వం పెల్లుబికింది మళ్ళీ
రాక్షసాగమనమనిరంజీతుపడకు
కాగితపు పులిజూచి గిల్లంతుకాకు
నామమాత్రానికే క్రుంగిపోవద్దు
నయవంచకులమాట నమ్మకోవద్దు
చదువురాని చట్టుబండపేరు సరస్వతి
బరిదెగించిన బజారుముండపేరు సుమతి
పాపయ్య చేయలేదేనాడు పాపం
వీరయ్య పట్టలేదొకనాడైన చాపం
పేరువిన్నంతనే క్రేమించబోకు

భ్రమచెంది ఎప్పుడూ భీరువై పోకు
దానవుని సైతమ్ము మానవునిగా మార్చు
మ చితనమే పుణ్యంసచితమ్మనుకొమ్ము
వలదమ్మ నీకింక భయము
కలుగులే మున్ముందు జయము

. . .

వే గు చు క్కల

పర్జన్యం గర్జించెను
పాంచజన్యనాదంవలె
ప్రభంజనుడు విజృంభించె
ప్రళయకాల రుద్రునివలె

పెనుతుఫాను చెలరేగెను
వినువీధిని విదళింపగ
కారుమబ్బు క్రమ్ముకొనెను
ధారుణి తిమిరములలమగ

ఆర్తనాదమెక్కడిదో
ఆవేదన ఎందులకో
శంపాలత కాంతిలోన
శవరూపమ్మొకటి నడచి

చేరువలో కనుపించగ
కారుణ్యాంబుధి యొక్కడు
ఆదరమున ప్రశ్నించెను
అనురాగమును కురిపించెను

ఎవరోయి నీవేటికి
జీవచ్ఛవమైపోతివి?
రాజకీయ ప్రభంజనపు
రాయిలో నలిగితివా?

సామాజిక దురాచార
సాగరకెరటమ్ముల కెదు
రీదలేక తూలి సోలి
వేదనతో క్రుంగియితివా?

అహంకారమదమత్తుల
అధికారపు గర్జనలో
గుండెలు తారెత్తి కుప్ప
కూలికుమిలిపోతివా?

కులమత వ్యామోహమ్ములు
కురిసే అగ్నిజ్వాలల్లో
మోసులెత్తు ఆశలన్ని
మొదలంట నశించేనా?

ఇదియేనా సోషలిజం?
ఇదియా సెక్యూలరిజం?
అనివాపోయెద వెందుకు
అడుగిడవోయ్ మునుముందుకు

పొగిడినంత పొంగిపోయి
భూరివరాలిచ్చుటకా
దేవుడుకాడీ మానవు
డేవిధమున జాలిపడడు

అయినా—

భయమందుకు భాయీ నీ
బాధలన్ని తొలగునోయి
అలముకొన్న అంధకార
మల్లల్లన వీగునోయి

వేగుచుక్క—పొడిచె నదిగో
వెలుగులు ప్రసరించె నవిగో
శుభోదయం సూచిస్తూ
శుకపిక గీతములివిగో

తూరుపుదిక్కున భానుడు
త్వరలో నుదయింపగలడు
అరుణారుణ కాంతులతో
అవని నింపి వేయగలడు

• • •

బేకారీ బొర్ భిఖారీ

'భవతీ భిక్షాందేహి
మాతా అన్నపూర్ణేశ్వరీ! మాంపాహి'
ఈశబ్దాలెన్ని శతాబ్దాలనాటివోగాని
లుబ్ధాగ్రేసరుల్ని సైతం
మంత్రముగ్ధుల్ని గావిస్తున్నవి
పాషాణ హృదయాల్ని సైతం
పాదరసంలా కరిగిస్తున్నవి
పరాన్నభుక్కులు ప్రసవించిన యీసినాదం
పురాణదృక్కుల్ని
పునీతంచేస్తున్న పవిత్రవేదం
ధర్మం చేస్తే
కర్మలన్నీ నశిస్తాయని
పట్టెడన్నంవేస్తే
పుట్టెడంత పుణ్యం లభిస్తుందనీ
నమ్మినవాళ్ళకూ
వివేచనాశక్తి నమ్మినవాళ్ళకూ
వివరం తెలియని వాక్కులు .
వేదవేదాంగఋక్కులు
వికలాంగులకూ

విశీర్ణాంగులకూ బదులు
సకలాంగ సౌష్టవం
సంతరించుకున్నవాళ్ళు
జన్మహక్కుగాను
జాతిహక్కుగాను
యాచకత్వాన్నెంచుకున్నవాళ్ళు
వ్యాధిగ్రస్తుల్లా
వేదనాసంత్రస్తుల్లా
నటించేవాళ్ళు
తెలుగులో యాచించడం
తేలికతనంగా భావించి
వచ్చిరాని వేదభాషలో
పచ్చిబూతులు పలికేవాళ్ళు
తగతరాలుగా సాగిస్తున్న భిక్షుకవృత్తి
నరజాతిని సవ్వులపాల్జేస్తున్న మనఃప్రవృత్తి
వైకుంఠుణ్ణి వైతగ
వామనుణ్ణిగావించిందనీ
సురాధిపుణ్ణి వైతం
సూతపుత్రునిముందు తలదింపించిందనీ
అందరికీ తెలిసినదే అయినా ఉదంతం
అన్వేషించాలి యిందులోని వేదాంతం.
చెమటోడ్చి పనిచేయడం

చిన్నతనంగా భావించే దేశంలో
చేతివృత్తులతో జీవించడం
సేవకవృత్తికన్నా హీనంగాచూచే ప్రదేశంలో
అడుక్కుతినడమెంతోహాయి
చెడిబ్రతుకుతున్నవాళ్ళదే పైచేయి
శీలాన్నమ్ముకొనైనా
శిల్కుచీర కట్టడంలోను
అడ్డమైన గడ్డితిని
ఐశ్వర్యం చేపట్టడంలోను
గొప్పతనముందనుకొనేవాళ్ళు
మెప్పులు పొందాలనుకొనేవాళ్ళు
ఒక్కటొంకాయతో
పాపపంకిలమంతా
ప్రక్షాళణం చేయగలమనుకునేవాళ్ళు
సోమరితనానికీ
పామరవనానకీ
నారువేసి నీరుబోసి
కర్మసిద్ధాంతాల 'యూరియా'చల్లి
కర్తవ్యసూత్రాలు గుర్తురానీకుండ
దాతృత్వక్షేత్రాన్ని విస్తృతంచేసి
విషవృక్షాల్ని విశేషంగా పోషిస్తున్న
ఆధ్యాత్మిక ధనపేటికలో

భారతీయ వనవాటికలో
అభ్యుదయమన్నది
ఆకాశకుసుమం
సభ్యతన్నది
వెట్టితలలు వేస్తున్న
కల్పద్రుమం

గుళ్ళు కట్టిస్తామని
ఇళ్ళస్థలాలిప్పిస్తామని
బళ్ళు పెట్టిస్తామని
బంజర్లిప్పిస్తామని
వసూలుచేసిన మొత్తాన్ని
వాటాదార్లు స్వాహాచేయడం
పడుపువృత్తిలో సైతం
పాతివ్రత్య మొలకబోయడం

అద్భుతమైన ఆచారమొకటి
అవతరించిందీ దేశంలో
విజయదశమి పండుగ రోజుల్లో
వింత ంతవేషాల్కాంధ్రదేశంలో
బడిపంతుళ్ళదగ్గర్నుంచి బడుద్ధాయిలదాక
పనివాళ్ళు మొదలుకొని

పనికిమాలిన భటాచోర్లదాక
ఆఫీసు అటెండర్లగాయితు
కాఫీహౌటల్ సర్వరుదాక
రిక్షావాలాతో సహా
బక్షీష్ కోరేవాళ్ళే
దసరా మామూలంటూ
కొసరికొసరి పీడించేవాళ్ళే
కరెంటాఫీసు కోపతాపాలకు
ఏయింటనైనా దీపాలారిపోతాయని
కోరిందిచ్చిపంపకపోతే
కుళాయిల్లో నీళ్లాగిపోతాయని
పోస్టుమెన్ని సంతప్తుణ్ణి చేయకపోతే
ఉత్తరాలన్ని చెత్తకాగితాల్లో చి పోతాయని
మామూళ్ళబెడద వదలించుకుంటున్న
మధ్యతరగతి భ్రాంతులు
రాతలుసరిలేని దాతలు
నేతలూ వస్తువ్రికేతలూ
ప్రాణాలు బిగబట్టుకొని
దానాలు చేస్తున్నారు
సానుభూతి చచ్చిపోయినా
చందాలిచ్చి పంపుతున్నారు
యాచకత్వానికెంత సహనశీలముందోగాని

ఛీకొడుతున్నా జేకొడుతున్నట్లోస్తుంది

సాగనంపజూస్తున్నా

స్వాగతం పలికినట్లనిపిస్తుంది

మక్షికాలూ మశకాలూ

కుక్షినింపుకోడానికి

భిక్షాటన చేస్తున్నాయూ?

ఘోటకాలూ కీటకాలూ

కూటికోసం కొంపలచుట్టూ

దేవురిస్తున్నాయూ

మానాభిమానాలు పోనాడిన

మానవుడిలా సంచరిస్తున్నాయూ?

అంతో యింతో

ఆలోచనాశక్తి ఉన్నవాడు

అప్పుడప్పుడాత్మాభిమానం

పెల్లుబుకుతున్నవాడు

తిరిపాన్ని మురిపంగా స్వీకరిస్తున్నవాడు

దేశదార్భాగ్యానికి

ప్రతీకగా నిలుస్తున్నవాడు.

మానవత్వాన్నే మైలపరస్తూ

తానూ ఒకమనిషిననుకుంటున్న యాచకవ్రతుడు

దీనులకూ అవయవహీనులకూ

పుట్టగతుల్లేకుండాచేస్తున్న పుణ్యవ్రతుడు

పాత్ర తెరుగక దానంచేయడం

క్షేత్ర మెరుగక విత్తనం వేయడం

ఏమాత్రం తగదన్నారు పెద్దలు

ఈసూత్రం కాలదన్నారు ప్రబుద్ధులు

భస్మాసురుడికి వరాలిచ్చి

పరమేశ్వరుడుపడ్డపాట్లు మరిచారుగాబోలు

మరుభూమిలో సేద్యంచేస్తే

ఎరువులఖర్చైనారాదని

ఎరుగరుగాబోలు!

ఉదరపోషణార్థం

ఉంఛవృత్తి నెంచుకున్న

దరిద్రనారాయణుల్లారా

స్వర్గానికి సోపానాలు

నిర్మించాలనుకుంటున్న

దానధర్మ పారాయణుల్లారా!

అనాథ రక్షణపేరిట

అలసత్వాన్ని పెంచకండి

దానధర్మాల పేరిట

దరిద్రాన్ని పెంచకండి

దేహి అంటున్నవాణ్ణి దేశద్రోహిగాను


పాహిఅంటున్నవాణ్ణి మహాపాపిగాను చాటించండి

దేశానికి వీసమెత్తయినా సేవచేయదలిస్తే

ప్రగతిఫలంలో కాస్తయినా
పాలుపంచుకోదలిస్తే
వినాశానికి హేతువైన బద్ధకాన్ని
బద్ధశత్రువుగా భావించండి
దానిపై మహాయుద్ధాన్ని ప్రకటించండి

* * * * *

C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No 10177
Date
CUDDAPAH



C. P. BROWN
MEMORIAL LIBRARY
Acc. No. 10133
Date
CUDDAPAH

ఈమని దయానంద

".....ఈ కవితా సంపుటి వ్యత్యాసాల చలితో వజ వజ వణకిపోయే దీన ప్రజకు విప్లవపు నిప్పుల - కుంపటి ఆకలితో అల్లాడే మెదళ్ళకు కమ్మని సంకటి."

—కళాప్రపూర్ణ డా॥ దాశరథి

".....సమాజం రోగగ్రస్తమైతే కవి వైద్యుడు కాక తప్పదు ఆధునిక కవి చేదు సత్యాలకు పంచదార పూతలు పూయడు కాని తర తరాల మూఢ విశ్వాసాల 'క్రానిక్' జబ్బులను నయం చేస్తాడు."

—ఆరుద్ర

".....అవసరమైన దాన్ని ఆయంపట్టి చెప్పడం ఉత్తమ కవి లక్షణం. ఈయన "సిద్ధాంతులూ ప్లస్ వేదాంతులు యీక్వల్ టు బడి పంతులు" కాబట్టి సిద్ధిపొందిన తన భావాలను సువిదితంగానే చెప్పారు. ఎంత చెప్పినా బాలహితం మాననట్లున్న వాళ్ళకు చెంపపెట్లుగా చెప్పవలసి వస్తుంది. అట్లా కొంత చెప్పారు."

—డా॥ ముకురాల రామారెడ్డి